క్లుప్తంగా

బీజేపీ ఎంపీ అభ్యర్థిని కలిసిన నాయకులు



జనగామ: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా ఎంపికైన, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌ను పార్టీ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు, డోర్నకల్ ప్రభారి బేజాడి బీరప్ప, నియోజకవర్గ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ మంగళవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలో మూడో సారి మోడీ సర్కార్ అధికారంలోకి రావాలంటే భువనగిరి ఖిల్లాపై కాషాయం జెండా ఎగరాలన్నారు. సీనియర్ నాయకులు శ్రీనివాస్ ఉన్నారు.

ఆటో దగ్ధం



చిల్పూరు: ఇంటి ఎదుట నిలిపిన ఆటో దగ్ధమైన ఘటన చిల్పూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు పోలు రమేష్ కథనం ప్రకారం.. రోజు మాదిరిగా రమేష్ ప్రయాణికులను ఆటోలో కిరాయికి తీసుకెళ్లి దించివచ్చిన అనంతరం ఇంటి ఎదుట పార్కింగ్ చేసి నిద్రించాడు. అర్ధరాత్రి ఒక్కసారిగా ఆటోలో మంటలు చెలరేగి టైర్లు పేలి శబ్దం రావడంతో వచ్చి చుట్టుపక్కల వారితో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించాడు. కానీ అప్పటికే ఆటో దగ్ధమైంది. దీంతో రూ.70వేల నష్టం జరిగిందని, కుటుంబానికి జీవనోపాధి అయిన ఆటో దగ్ధమైందని రోదించాడు. ఈ విషయమై విచారణ చేపట్టాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ ఉద్దేమారి రాజ్‌కుమార్, ఉట్కూరి సునయ్ తదితరులు బాధితుడిని పరామర్శించారు.

రఘునాథపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మహేష్



మహేష్, అనిల్‌కుమార్, సతీష్

రఘునాథపల్లి: రఘునాథపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఆకుల మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో మండల పాత్రికేయులు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహేష్‌తో పాటు ప్రధాన కార్యదర్శిగా కందుల అనిల్‌కుమార్, కోశాధికారి కొన్నె సతీష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాత కమిటీ అధ్యక్షుడు మేకల రవీందర్, ప్రధాన కార్యదర్శి బంద రవీందర్, కోశాధికారి సుంకరి శ్రీనులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పాత్రికేయులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఎండుతున్న పొలాలు



రఘునాథపల్లి: కొందరు రైతుల అభ్యంతరంతో విద్యుత్ కాంట్రాక్టర్ తీసుకున్న చర్యలు ఆ ట్రాన్స్‌ఫార్మర్ కింది పంట పొలాలకు శాపంగా మారింది. మండలంలోని కోడూర్ పరిధిలోని ఎస్ ఎస్ 7 ట్రాన్స్‌ఫార్మర్‌కు రెండు ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది. నాలుగు రోజుల క్రితం ఓ ఫీడర్ లైన్ తీగ తెగి కింద పడటడంతో రైతులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. వారు చేరుకొని తీగలను సరిచేశారు. ఈ నేపథ్యంలో ప్రమాదకరంగా తరచూ తీగలు తెగుతున్నాయని, రెండు ఫీడర్లకు కాకుండా కొత్త లైన్‌కు కలెక్షన్ ఇవ్వాలని ట్రాన్స్‌ఫార్మర్ భూమి గల రైతులు మిగతా రైతులతో వాగ్వావాదానికి దిగారు. దీంతో సదరు విద్యుత్ కంట్రాక్టర్ మూడు రోజుల క్రితం తీగలు కట్‌చేసి వదిలేయడంతో పొలాలు ఎండుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్వయంపాలన దినోత్సవం



బచ్చన్నపేట: మండలంలోని బండనాగారం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తరగతుల్లో పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు బందారం లక్ష్మయ్య బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్దయ్య, మదూరి వెంకటేష్, రాజేందర్, పంచాయతీ కార్యదర్శి భరత్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ సుంకోజు రజిత, ఆయా మానెపల్లి వెంకమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న అనిత



జనగామ: కబడ్డీ ఆడుతున్న మహిళలు

జఫర్‌గఢ్: మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ టి.అనిత, అంగన్‌వాడీల సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు మచ్చ శారద అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని వడ్డెగూడెం, హిమ్మత్‌నగర్-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్ రాజకళ, ఆయాలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

13వ వార్డులో మహిళలకు ఆటల పోటీలు

జనగామ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని 13వ వార్డులో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మహిళలకు ఆటల పోటీలను నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళరాజు పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, ఇతర పోటీల్లో మహిళలు తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం విజేతలకు సీడీపీఓ చేతులమీదుగా బహుమతులను అందజేసి సత్కరించారు.

కొనసాగుతున్న ఇసుక దందా



ఇసుక తోడటంతో ఏర్పడిన గుంత

జనగామ: వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి జనగామ మండలం యశ్వంతాపూర్ వాగును ఇసుక మాఫియాసురులు తోడేస్తున్నారు. గతంలో 'సాక్షి' కథనంతో అధికార యంత్రాంగం ఇసుక తరలింపును అడ్డుకున్నప్పటికీ, తిరిగి యథావిధిగా కొనసాగుతోంది. యశ్వంతాపూర్ వాగుపై ఉన్న రైల్వే ట్రాక్ పిల్లర్ల కింద సైతం మట్టి తేలే వరకు తోడేశారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసును తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉదయం 6 గంటలు దాటితే ఎక్కడి వారు అక్కడే గప్‌చుప్ అన్న చందంగా మారిపోతుంది. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకుంటే తిరగబడే అవకాశం ఉండడంతో సామాన్య ప్రజలు ఎవరూ కూడా సాహసం చేయడం లేదు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.

వైద్యశిబిరం



బచ్చన్నపేట: ప్రతి ఒక్కరికి కళ్లు ప్రధానమైనవని, వాటి విషయంలో అశ్రద్ధ చేయొద్దని మండలంలోని బండనాగారం మాజీ సర్పంచ్ శివరాత్రి కవిత, క్యాంపు కోఆర్డినేటర్ వంశీ అన్నారు. మంగళవారం గ్రామంలోని జీపీ కార్యాలయంలో హనుమకొండలోని శరత్ మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. వంద మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భరత్‌కుమార్, ఆశ వర్కర్ ఇజ్జగిరి అనిత, క్యాంపు సిబ్బంది ప్రవీణ్, సుధీర్, అనూష, నాయకులు గూడెముల్ల ప్రభాకర్, సవాదు మల్లారెడ్డి, బత్తిని నాగరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాంనూర్‌లో 11కేవీ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదని ఎన్‌పీడీసీఎల్ శివునిపల్లి ఏఈ ఉప్పుల శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం కోసం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న గౌడ కులస్తులు

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో మంగళవారం రేణుకా ఎల్లమ్మ బోనాలను గౌడ కులస్తులు వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఎల్లమ్మ ఆలయానికి చేరుకొని పట్నం వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పట్టు వస్త్రాల సమర్పణ

మండలంలోని చిన్నపెండ్యాలలోని రేణుకా ఎల్లమ్మ బోనాల సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పూజారి రాజ్‌మోహన్‌ల సమక్షంలో గ్రామానికి చెందిన బొల్లెపాక శ్రీనివాస్ అమ్మవారికి పట్టు వస్త్రాలను మంగళవారం సమర్పించాడు. రామనారయణ, క్రాంతికుమార్, బాలమల్లు, మొగిళి, గట్టు రవి, రామ్‌చరణ్, లక్ష్మీనారాయణ, రాజు పాల్గొన్నారు.

కార్మికులు మెళకువలు పాటించాలి



శిక్షణలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

రఘునాథపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా భవన నిర్మాణ రంగాల కార్మికులు ఇళ్ల నిర్మాణాల్లో ఆధునిక మెళకువలు పాటించాలని భవన నిర్మాణ కార్మికుల శిక్షకుడు వేణుగోపాల్ అన్నారు. మండలంలోని కంచనపల్లిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ వారి సహకారంతో కట్టడాలపై భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా టి.వేణుగోపాల్ మాట్లాడుతూ లేబర్ కార్డు కలిగి ఉన్న 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న భవన నిర్మాణ కార్మికుల కోసంఈ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. 15 రోజుల శిక్షణకు హాజరైన కార్మికులకు రూ.4,500 నగదుతో పాటు మధ్యాహ్న భోజనం, టీ షర్ట్స్, హెల్మెట్, నోట్‌బుక్, బ్యాగ్, ఎన్‌ఏసీ సర్టిఫికెట్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భవన నిర్మాణ రంగాల కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వెలిశాల సుధాకర్, మల్లేష్, ఎల్లయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులతో రవీందర్, ఉపాధ్యాయులు

పాలకుర్తి: పాలకుర్తిలోని కస్తూర్బా విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థులకు మహాత్మాగాంధీ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంట రవీందర్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని మంగళవారం అందజేశారు. ఎంఎస్ఓ నర్సయ్య, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వీరమల్ల బాబయ్య, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాలాల్ విద్యార్థి సేన ఆధ్వర్యంలో..

మండలంలోని చెన్నూరు పాఠశాల విద్యార్థులకు సేవాలాల్ విద్యార్థి జిల్లా సేనా ఆధ్వర్యాన పరీక్ష సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. జిల్లా సేన అధ్యక్షుడు శంకరనాయక్, జిల్లా కార్యదర్శి లావుడ్య అనిల్ చౌహాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

● దంపతులకు గాయాలు



గాయపడిన వెంకట్రాంనాయక్

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు పల్లగుట్ట క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని రెడీమిక్స్ లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న భూక్య వెంకట్రాంనాయక్ తీవ్రంగా గాయపడగా, అతడి భార్య రంగమ్మకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జఫర్‌గడ్ మండలం అల్వార్‌బండ తండాకు చెందిన భూక్య వెంకట్రాంనాయక్, అతని భార్య రంగమ్మ వ్యక్తిగత పనులపై మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్‌కు వచ్చారు. అనంతరం చిల్పూరు మండలం దేశాయితండాకు వెళ్లి వస్తుండగా పల్లగుట్ట క్రాస్‌రోడ్డు వద్ద వారు రోడ్ క్రాస్‌చేస్తుండగా చిన్నపెండ్యాల నుంచి ఘన్‌పూర్ వైపునకు వస్తున్న రెడీమిక్స్ లారీ టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకట్రాంనాయక్ తలకు తీవ్ర గాయాలై అధిక రక్తస్రావమైంది. అతడి భార్య రంగమ్మకు కణతకు, కాలికి, చేతికి గాయాలయ్యాయి.

మానవత్వం చాటుకున్న తాటికొండ రాజయ్య

రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రమాదం జరిగిన విషయాన్ని గుర్తించి తన వాహనాన్ని ఆపి గాయపడ్డ వారిని పరిశీలించారు. క్షతగాత్రుల వివరాలను తెలుసుకుని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి రాజయ్య తన మానవత్వం చాటుకున్నారు. కాగా, వెంకట్రాంనాయక్ పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడ నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉంది. కాగా, రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న సీఐ ముస్క రాజు, ఎస్సై నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఘటనా స్థలిలో వాహనాలు

బ్రహ్మోత్సవాలకు బందోబస్తు

డీసీపీ సీతారాం



ఆలయ అధికారులకు సూచనలిస్తున్న డీసీపీ

బచ్చన్నపేట: బ్రహ్మోత్సవాలకు బందోబస్తు ఏర్పాటు చేస్తామని జనగామ డీసీపీ సీతారాం అన్నారు. కొడవటూరు గ్రామంలోని స్వయంభూ సిద్ధేశ్వరాలయంలో డీసీపీ, ఏసీపీ దామోదర్‌రెడ్డి, నర్మెట సీఐ సాయిరమణ, ఎస్సై కంకల సతీష్‌లతో పాటు పలువురు అధికారులు ప్రత్యేక పూజలు మంగళవారం చేశారు. అనంతరం అగ్ని గుండాలు, శివకల్యాణం జరిగే స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

నేటినుంచి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాలను నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చిందం వంశీ తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. ఉదయం 9 గంటలకు గంగపూజతో ప్రారంభమై ఋత్వికారణము, అవాహన దేవత పూజ, పంచామృత శతరుద్రాభిషేకము, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ పూజలు ఉంటాయన్నారు. శివపార్వతుల కల్యాణంలో కూర్చునే జంటలు రూ.1,516 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో చల్ల రాజేందర్‌రెడ్డి, మధు, క్రాంతి, భానుచందర్‌రెడ్డి, అనిల్, జమాలొద్దీన్, గంగం సతీష్‌రెడ్డి, ఓం నమశివాయ, రాజేందర్‌రెడ్డి, మధు, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో ఆలయం

లుసిడా రైటింగ్‌పై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

జనగామ: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఏరియా ప్రభుత్వ పాఠశాలలో అక్షర సంస్థ ప్రతినిధి మిరాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు లుసిడా రైటింగ్‌పై అవగాహన శిక్షణ ఇచ్చారు. సోమవారం ప్రధానోపాధ్యాయుడు ఉప్పలయ్య ఆధ్వర్యంలో ఆంగ్ల ఉపాధ్యాయులు బి.చొక్కయ్య, మురళి పర్యవేక్షణలో 9వ తరగతికి చెందిన 88 మంది విద్యార్థులకు లుసిడాపై అవగాహన కల్పించి, ఒకొక్కరిచే రాత పరీక్ష ద్వారా వారిలోని ప్రతిభను గుర్తించారు. ఇందులో ఐదుగురు విద్యార్థులను గుర్తించి రూ.250 విలువ చేసే లుసిడా ప్రాక్టీసు నోట్‌బుక్స్‌ను అందించారు. అనంతరం మిరాజ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లుసిడా రైటింగ్‌ను 42 రోజుల పాటు ప్రాక్టీసు చేయాలని సూచించారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు 10/10 సాధించాలని ఆకాంక్షించారు.

'గృహజ్యోతి'ని సద్వినియోగం చేసుకోవాలి



జీరో బిల్లును అందజేస్తున్న ఏడీ, ఏఈ

జనగామ రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏడీ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండంలోని మరిగడి గ్రామంలో ఇంటింటా జీరో బిల్లులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ 200 యూనిట్ల వరకు ఉచిత బిల్లు ఎవరికైనా వర్తిస్తుందన్నారు. జీరో బిల్లు రాని వారు ఎంపీడీఓ కార్యాలయంలో సంబంధిత ప్రజాపాలన నంబర్‌తో సంప్రదించి పథకాన్ని పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో లైన్‌మన్ హైమద్ బేగ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కూరాకుల నాగరాజు, కర్రె పర్శరాములు, శివగణేష్, చిరంజీవి, శ్రీహరి, అబ్బసాయిలు, కమలాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో సంతలు.. తీరుతున్న సరుకుల చింతలు



కడవెండిలో సంత

దేవరుప్పుల: ఒకప్పుడు వారాంతపు సంతలకు మండలేతర దూరపు ప్రాంతాలకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకునే కష్టాలకు స్వస్తి పలికేలా మారుమూల పల్లెల ముంగిట వెలుస్తున్న సంతలతో మహిళలకు సరుకులు తెచ్చే చింతలు దూరమయ్యాయి. మండలంలో మంగళవారం కడవెండి, గురువారం సింగరాజుపల్లి, శనివారం దేవరుప్పులలో కూరగాయలు, నిత్యావసర సరుకులు హోల్‌సేల్ ధరలకు లభించడంతో ఆ గ్రామాల్లో పట్టణాలకు తీసిపోకుండా సందడి కనిపిస్తుంది.

అష్టదళ పాద పద్మారాధన

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్త జనసందోహం నడుమ బంగారు పుష్పాలతో అష్టదళ పాద పద్మారాధన పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మాలతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు వేద మంత్రాల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సిబ్బంది రమేష్, వీరన్న, లక్ష్మి, మల్లికార్జున్, వసంత పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు

జఫర్‌గఢ్: స్థానిక ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శీలం రవి యాదవ్‌ను కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు అన్నెబోయిన భిక్షపతి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఎస్సైని సత్కరించారు.

ఎస్సైని కలిసిన మండల వైస్ ఎంపీపీ

చిల్పూరు: స్థానిక ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ముత్యం రాజేందర్‌ను మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ భూక్య సరితనర్సింహ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొల్లపల్లి వాసు తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓను కలిసిన కాంగ్రెస్ నాయకులు

రఘునాథపల్లి: రఘునాథపల్లి ఎంపీడీఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గార్లపాటి శ్రీనివాసులును మంగళవారం కాంగ్రెస్ నాయకులు, ఎంపీటీసీలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు మేకల నరేందర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రచ్చ సోమనాథ్, కోఅప్షన్ సభ్యుడు ఎండీ షబ్బీర్‌మియా, ఫతేషాపూర్ మాజీ సర్పంచ్ హయత్‌అలీ, ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎన్నిక

పాలకుర్తి: పాలకుర్తి నుంచి జనగామ వెళ్లే రూట్ ఆటో యూనియన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్లరాయని తొర్రూరు గ్రామానికి చెందిన బక్క నగేష్, ఉపాధ్యక్షుడిగా గుగులోత్ బాలు, కార్యదర్శిగా గోనె కిరణ్, కోశాధికారిగా మామిండ్ల కర్నాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొడకండ్ల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం మండలకేంద్ర శివారులో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ధరావత్ రాజ్‌కుమార్, నవీన్, రాజేష్ వాహనంలో అక్రమంగా 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మహబూబాద్ జిల్లా పెద్దవంగర నుంచి భువనగిరికి తరలిస్తుండగా కొడకండ్ల శివారులో పట్టుకొన్నట్లు ఎస్సై తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

సుధాకర్ మృతి తీరని లోటు

బచ్చన్నపేట: మండలంలోని తమ్మడపల్లిలో సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ తండ్రి సుధాకర్ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డితో కలిసి పరామర్శించారు. మృతదేహంపై పార్టీ జెండాను కప్పి శ్రద్ధాంజలి ఘటించారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

తరిగొప్పుల: మండలంలోని బొత్తలపర్రె గ్రామంలో గుడుంబా తయారు చేస్తున్న స్థావరంపై ఎస్సై అయ్యల శ్వేత మంగళవారం దాడులు చేపట్టారు. మండలంలోని బొత్తలపర్రె గ్రామానికి చెందిన ముండావర్ అనసూయ గుట్టుచప్పుడు కాకుండా గ్రామ శివారులో వ్యవసాయక్షేత్రంలో గుడుంబా తయారు చేస్తున్నట్లు పక్కా సమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించగా గుడుంబా తయారు చేస్తూ పట్టుబడినట్లు తెలిపారు. సదరు మహిళ వద్ద నుంచి 4 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిషేధిత గుడుంబా తయారి చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

సాగునీటిని విడుదల చేయండి

బచ్చన్నపేట: మండలంలోని పంటలకు సాగునీరు విడుదల చేయాలని చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాసపేట రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా తపాస్‌పల్లి రిజర్వాయర్ వద్దకు వెళ్లి ఏఈ రాజశేఖర్, అధికారులకు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో బోర్లు, బావుల ద్వారా పంటలకు నీరు అందక ఎండుతున్నాయన్నారు. రిజర్వాయర్ కాల్వ ద్వారా సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. నాయకులు బండకింది హరిబాబుగౌడ్, జంగిటి విద్యానాథ్, వంచ వెంకట్‌రెడ్డి, అల్వాల ఎల్లయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జఫర్‌గఢ్: తీగారం పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న రాథోడ్ కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మండలంలోని తీగారం ప్రభుత్వ పాఠశాలను మంగళవారం రాథోడ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు, భోజన వసతి తదితర సదుపాయాలను పరిశీలించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



స్టేషన్‌ఘన్‌పూర్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని డివిజన్ కేంద్రంలోని స్వయంభూ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 7,8వ తేదీల్లో నిర్వహించనున్న ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ దేవాలయకమిటీ బాధ్యులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మంగళవారం ఆహ్వానించారు. హనుమకొండలోని కడియం నివాసంలో ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందించి కరపత్రాలను ఆవిష్కరించారు. సీనియర్ నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ గన్ను నర్సింహులుగుప్తా, పూజారి శ్రీనివాస్‌శర్మ, దేవాలయ అభివద్ది కమిటీ బాధ్యులు గౌరిశెట్టి శ్రీనివాస్, పులి రమేష్, గన్ను రమేష్ ఉన్నారు.